పోలింగ్ శాతం పెంపు లక్ష్యంగా..

- క్షేత్రస్థాయిలో ఈవీఎంలపై అవగాహన
- ఈ నెల 26,27 తేదీల్లో ప్రత్యేకంగా ఓటరు నమోదు
- ఆగస్టు 21 ముసాయిదా ప్రకారం ఓటరు జాబితా
- సెప్టెంబర్‌లో తుది జాబితా


ఇటిక్యాలలో ఓటు నమోదు చేస్తున్న బీఎల్‌వో


నామాపూర్‌లో ఈవీఎంలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

నియోజకవర్గం	మొత్తం ఓటర్లు	పురుషులు	స్త్రీలు	ఇతరులు	సర్వీస్ ఓటర్లు
కోరుట్ల	227521	109083	118436	2	47
జగిత్యాల	217831	105693	112123	15	43
ధర్మపురి	214109	105400	108707	2	131
మొత్తం	659461	320176	339266	19	221

రాయికల్/పెగడపల్లి: ఈ ఏడాదిలో నిర్వహించే అసెంబ్లీ ఎన్నికలకు అధికార యంత్రాంగం ఏర్పాట్లలో నిమగ్నమైంది. ఓటరు జాబితా కూడా సిద్ధం చేస్తున్నారు. గోదాంలో భద్రపరిచిన ఈవీఎంలను పనితీరు మొదటి దశ పరిశీలన కూడా పూర్తి చేశారు. ఎలక్ట్రానిక్ యంత్రాలపై ప్రజల్లో అనుమానాలు తొలగించి అవగాహన కల్పించి ఓటింగ్ శాతం పెంచాలని ఎన్నికల సంఘం ఆదేశించింది. దీంతో నియోజకవర్గాల వారీగా గ్రామాల్లో ఈవీఎంల పనితీరు, ఓటింగ్ చేయు విధానం, ఓటు నమోదు తదితర అంశాలపై అధికారులు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. జిల్లాలో గత అసెంబ్లీ ఎన్నికల్లో 75 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఈ సారి పోలింగ్ శాతం పెంచేందుకు అధికారులు కృషి చేస్తున్నారు. ఈవీఎంల వినియోగంపై అవగాహన కల్పిస్తున్నారు. ప్రధానంగా అపోహాలు తొలగించడం ద్వారా ఓటింగ్ శాతం పెంచాలని యంత్రాంగం భావిస్తోంది. పోలింగ్ కేంద్రాల వారీగా ఈవీఎంలను సిబ్బంది తీసుకెళ్లి వాటి పనితీరును వివరిస్తున్నారు.

బీఎల్వోల వద్ద..

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలనే ఉద్దేశంతో ఈ నెల 26, 27 తేదీల్లో ప్రత్యేక నమోదు కార్యక్రమాన్ని చేపడుతున్నారు. ఆ రెండు రోజుల పాటు పోలింగ్ కేంద్రాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు స్థానిక బీఎల్‌వోలు (బూత్ స్థాయి అధికారి) అందుబాటులో ఉంటారు. 2023 అక్టోబరు 1 నాటికి 18 ఏళ్లు నిండితే వారు ఓటరుగా నమోదు చేసుకోవచ్చు.

సెప్టెంబరులో మరోసారి..

ఈ నెలలో చేపట్టే కార్యక్రమంలోనూ ఎవరైనా తప్పిపోతే.. వారికి సెప్టెంబరు 2, 3 తేదీల్లో బీఎల్వోలు మరోసారి పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉంటారు. వారి వద్ద ఉండే ఓటరు జాబితాను పరిశీలించుకోవచ్చు. తమ పేరు ఉందా లేదా అనేది చూసుకోవచ్చు. ఏదైనా కారణంతో పేరు లేకపోతే వెంటనే దరఖాస్తు చేసుకోవచ్చు. అనంతరం వచ్చిన దరఖాస్తులు పరిశీలించిన తర్వాత అక్టోబరు 4న ఓటరు తుది జాబితా విడుదల చేస్తారు.

ఈవీఎంలపై అవగాహన



పోలింగ్ శాతం పెంపు కోసం క్షేత్రస్థాయిలో ఈవీఎంలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ఈవీఎంల పనితీరు, ఓటింగ్ చేయు విధానం, వీవీ ప్యాట్ల లెక్కింపు, ఓటరు నమోదు తదితర అంశాలపై అవగాహన కల్పించి ప్రతి ఒక ఓటరుకు ఈవీఎం యంత్రాలపై ఉన్న అపోహాలను తొలగిస్తున్నాం.

ఎంఏ ఫరూక్, తహసీల్దార్, పెగడపల్లి

ఓటరుగా నమోదు చేసుకోవాలి



2023 అక్టోబర్ 1 నాటికి 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులు ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలి. ఈనెల 26, 27 తేదీల్లో ప్రత్యేక కార్యక్రమం రూపొందిస్తున్నాం. యువత బీఎల్వోలను సంప్రదించి ఓటరు నమోదు చేసుకుని అమూల్యమైన ఓటు హక్కు పొందాలి.

– నర్సింహమూర్తి, ఆర్డీవో, జగిత్యాల

క్లుప్తంగా

సీఎం, మంత్రి చిత్రపటాలకు క్షీరాభిషేకం


క్షీరాభిషేకం చేస్తున్న వెంకటాపూర్ గ్రామస్తులు

వెల్గటూర్: మండలంలోని వెంకటాపూర్ గ్రామానికి రోడ్డు నిర్మాణానికి రూ.1.40 కోట్ల నిధులు మంజూరు కావడంతో గ్రామస్తులు బుధవారం సీఎం కేసీఆర్, మంత్రి కొప్పుల ఈశ్వర్‌ల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ వెంకటాపూర్‌కు వెళ్లడానికి మట్టి రోడ్డు తప్పా.. మరే దారి లేదని, దీనిపై మంత్రి కొప్పుల ఈశ్వర్ దృష్టికి తీసుకెళ్లగా, నిధులు మంజూరు చేశారని తెలిపారు. ఎన్నో ఏళ్ల గ్రామస్తుల కల నెరవేర్చిన సీఎం కేసీఆర్, మంత్రి కొప్పులకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామస్తులంతా స్వీట్లు పంచి ఆనందాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వెల్గటూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పత్తిపాక వెంకటేశ్, ఎంపీటీసీ పొడేటి సతీష్,అల్లం దేవమ్మ, మాజీ సర్పంచ్ అల్లం శంకరయ్య, మండల అధ్యక్షుడు రాంచంద్రం, ప్రధాన కార్యదర్శి జూపాక కుమార్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు అభినందనల వెల్లువ


ఎమ్మెల్యేకు స్వీట్లు తినిపిస్తున్న నాయకులు

జగిత్యాల: బీఆర్‌ఎస్ పార్టీ జగిత్యాల నియోజకవర్గ అభ్యర్థిగా మరోసారి అవకాశం కల్పించడం పట్ల నాయకులు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను సత్కరించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్‌దావ వసంత, మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, మోర హన్మండ్లు, ముప్పాల రాంచందర్‌రావు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం


మందులు అందిస్తున్న వైద్యురాలు

మెట్‌పల్లి రూరల్: మండలంలోని ఆత్మకూర్‌లో బుధవారం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఆరోగ్య కేంద్రంలో జలుబు,దగ్గు,జ్వరం,చర్మ సంబంధిత వ్యాధులతో పాటు పలు రకాల వ్యాధులకు సంబంధించిన పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి అంజిత్ రెడ్డి, ఆయుర్వేద వైద్యురాలు నితీష, క్రిష్ణవేణి, ఫార్మసిస్ట్ చిరంజీవి,సర్పంచ్ లావణ్య, ఎంపీటీసీ పుష్ప, ఉపసర్పంచ్ శ్రీధర్, వార్డు మెంబర్లు, నాయకులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ రోడ్ షోకు తరలిన నాయకులు


బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ

మల్లాపూర్: బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కల్వకుంట్ల సంజయ్‌కుమార్ రోడ్ షోలో పాల్గొనేందుకు బుధవారం మల్లాపూర్ మండల ప్రజాప్రతినిధులు, నాయకులు తరలివెళ్లారు. మండల కేంద్రంతో పాటు అన్నిగ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకులు బైక్ ర్యాలీ చేపట్టి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ కాటిపెల్లి సరోజన, వైస్ ఎంపీపీ గౌరు నాగేష్, రైతుబంధు కమిటీ జిల్లా సభ్యుడు దేవ మల్లయ్య, మండల అధ్యక్షుడు కోమ్ముల జీవన్‌రెడ్డి, టీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తోట శ్రీనివాస్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

ఐకమత్యంతోనే యాదవుల అభివృద్ధి

రాయికల్: ఐకమత్యంతోనే యాదవులు అభివృద్ధి చెందుతారని యాదవ సంఘం మండల అధ్యక్షుడు వాసరి రవియాదవ్ అన్నారు. బుధవారం రాయికల్ మండలం కిష్టంపేట, అయోధ్య గ్రామాల్లో సభ్యత్వ నమోదు నిర్వహించారు. యాదవులు ఐకమత్యంగా ఉంటేనే అన్ని రంగాల్లో రాణించవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి రాజేశ్‌యాదవ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బర్కం మల్లేశ్‌యాదవ్, నాయకులు గడ్డం మల్లారెడ్డి, దంటిక రాజేశ్, మల్లేశ్‌యాదవ్, అనిల్ పాల్గొన్నారు.

చంద్రయాన్–3 సంబురాలు




మల్యాలలో సంబురాలు చేసుకుంటున్న విద్యార్థులు, రాయికల్ పట్టణంలో యువకులు..

జగిత్యాలరూరల్: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ చంద్రయాన్–3 విజయవంతం కావడంతో బుధవారం రాత్రి జగిత్యాల రూరల్, అర్బన్ మండలంలోని అన్ని గ్రామాల్లో యువతీ, యువకులు టపాసులు పేల్చి సంబరాలు నిర్వహించుకున్నారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు.

మల్యాల: ఇస్రో చంద్రయాన్–3 ప్రాజెక్టులో భాగంగా చంద్రుడిపై విజయవంతంగా సాఫ్ట్ ల్యాండింగ్ కార్యక్రమాన్ని మల్యాల మండల కేంద్రంలోని వాగ్దేవి పాఠశాల విద్యార్థులు టీవీల్లో చూసి, విజయోత్సవాలు నిర్వహించారు. టపాసులు పేల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ పోకల నరేశ్, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాయికల్: చంద్రయాన్–3 విజయవంతం కావడంతో రాయికల్ పట్టణంలోని పాతబస్టాండ్‌లో యువజన సంఘాలు, బీజేపీ నాయకులు బుధవారం రాత్రి త్రివర్ణ పతాకాలు ఎగురవేస్తూ, సంబరాలు నిర్వహించారు.

మండలంలోని ఇటిక్యాల మోడల్‌స్కూల్‌లో బుధవారం చంద్రయాన్–3 సేఫ్ ల్యాండింగ్ గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీధర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ఇబ్రహీంపట్నం బీసీ హాస్టల్‌లో చంద్రయాన్ -3 వీక్షిస్తున్న విద్యార్థులు

'త్వరలో కాంగ్రెస్‌లోకి 20 మంది బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు'


మాట్లాడుతున్న జువ్వాడి నర్సింగరావు

మెట్‌పల్లి: కోరుట్ల, మెట్‌పల్లి మున్సిపాలిటీలకు చెందిన 20 మంది బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరడానికి సిద్ధంగా ఉన్నారని ఆ పార్టీ నాయకుడు జువ్వాడి నర్సింగరావు అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం నియోజకవర్గానికి చెందిన పలువురు ఆయన సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీఆర్‌ఎస్ వైఖరి నచ్చక ఆ పార్టీ కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరాలని నిర్ణయించుకున్నారు. తొందరలోనే పార్టీలోకి బీఆర్‌ఎస్ నుంచి భారీగా చేరికలు ఉంటాయన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకపోవాలని, వచ్చే ఎన్నికల్లో గెలుపు కోసం ప్రతి ఒక్కరూ శ్రమించాలన్నారు. కార్యక్రమంలో జువ్వాడి కృష్ణారావు, ఎలాల జలపతిరెడ్డి, నాయకులు ఉన్నారు.

వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీదే అధికారం

- యూపీ ఎమ్మెల్యే పీఎన్ పాఠక్


మాట్లాడుతున్న పీఎన్ పాఠక్

వెల్గటూర్: రానున్న ఎన్నికల్లో తెలంగాణలో అధికారంలోకి వచ్చేది బీజేపీనేనని, దీని కోసం కార్యకర్తలంతా కృషి చేయాలని ఉత్తరప్రదేశ్ రాష్ట్ర ఖుషీనగర్ బీజేపీ ఎమ్మెల్యే పీ.ఎన్. పాఠక్ అన్నారు. బుధవారం ఎండపల్లి మండలం రాజారాంపల్లిలో ఓ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే ప్రవాస్ యోజన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తెలంగాణలో దళిత ముఖ్యమంత్రి, దళితులకు మూడెకరాల భూమి, విద్యార్థులకు నిరుద్యోగ భృతి, డబుల్ బెడ్‌రూం ఇళ్ల లాంటి అడ్డగోలు హామీలిచ్చి ఏ ఒక్కటీ నెరవేర్చకుండా మళ్లీ ఇప్పుడు దళితబంధు, బీసీ బంధు, గృహలక్ష్మి లాంటి అమలుకు యోగ్యం కాని హామీలతో మరోసారి తెలంగాణ ప్రజలను మోసం చేసే కుట్ర చేస్తున్నాడని, ప్రజలు గమనించాలని కోరారు. ఒకప్పుడు ఉత్తరప్రదేశ్‌లో 12 స్థానాలకు పరిమితమైన బీజేపీ ఈ రోజు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. అలాగే తెలంగాణలో కూడా కార్యకర్తలు అవిశ్రాంతంగా పోరాడితే రానున్న ఎన్నికల్లో ఖచ్చితంగా తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు గాజుల మల్లేశం, మండల అధ్యక్షుడు చక్రపాణి, కొత్తపేట సర్పంచ్ రాంబాబు, వివిధ మోర్చాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ టికెట్ కోసం పలువురి దరఖాస్తు


గాంధీభవన్‌లో దరఖాస్తు చేస్తున్న నరేశ్‌రెడ్డి

కథలాపూర్/మేడిపల్లి: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ గల్ఫ్ విభాగం అధ్యక్షుడు, భీమారం మండలం మన్నెగూడెం సర్పంచ్ సింగిరెడ్డి నరేశ్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలని బుధవారం గాంధీభవన్‌లో దరఖాస్తు సమర్పించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని వేములవాడ, జగిత్యాల, కోరుట్ల నియోజకవర్గాల్లో ఏదైనా ఒక టికెట్ గల్ఫ్ కోటాలో ఇవ్వాలని దరఖాస్తు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. గల్ఫ్ కార్మికుల ప్రతినిధిగా ఎమ్మెల్యేగా గెలిచి సత్తా చాటుతానని ధీమా వ్యక్తం చేశారు.

వేములవాడ టికెట్ కోసం అంజయ్య ..


దరఖాస్తు సమర్పిస్తున్న తొట్ల అంజయ్య

కథలాపూర్: వేములవాడ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా రాబోయే ఎన్నికల్లో తనకు అవకాశం కల్పించాలని కథలాపూర్ మండలం పోతారం గ్రామానికి చెందిన పీసీసీ కార్యవర్గసభ్యుడు తొట్ల అంజయ్య బుధవారం అధిష్టానానికి దరఖాస్తు చేసుకున్నారు. అంజయ్య మండలంలోని కాంగ్రెస్ నాయకులతో కలిసి హైదరాబాద్‌కు వెళ్లారు. కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇవ్వాలని గాంధీభవన్‌లో దరఖాస్తు సమర్పించినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో కిసాన్‌సెల్ మండలాధ్యక్షుడు అల్లూరి దేవారెడ్డి, జిల్లా కార్యదర్శి గోపిడి ధనుంజయ్, కుంభం మహేశ్ ఉన్నారు.

ఇంగ్లిష్ పోస్టు భర్తీకి 26న ఇంటర్వ్యూ

మల్యాల: మండలంలోని నూకపల్లి ఆదర్శ పాఠశాలలో ఇంగ్లిష్ సబ్జెక్టు బోధించేందుకు ఆసక్తి ఉన్న వారు నేరుగా ఈ నెల 26న పాఠశాలలో ఉదయం 10 గంటలకు నిర్వహించే ఇంటర్వ్యూకు హాజరు కావాలని ప్రిన్సిపాల్ సరితాదేవి తెలిపారు. ఎంఏ ఇంగ్లిష్, బీఈడీ ఉత్తీర్ణులై ఉన్న వారు అర్హులని, గంటల విధానంపై వేతనం చెల్లిస్తామని, ఆసక్తిగల వారు ఇంటర్వ్యూకు హాజరుకావాలని కోరారు.

బీఆర్‌ఎస్‌ను గద్దె దించడానికి సిద్ధం కావాలి

- బీజేపీ ఎమ్మెల్సీ జీబీ పాటిల్


మాట్లాడుతున్న బీజేపీ ఎమ్మెల్సీ జీబీ పాటిల్

సారంగాపూర్: వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీని గద్దెదించే సమయం ఆసన్నమైందని, కార్యకర్తలు, నాయకులు ప్రజాక్షేత్రంలో యుద్ధానికి సిద్ధం కావాలని బీజేపీ కర్నాటక ఎమ్మెల్సీ జీబీ పాటిల్ అన్నారు. బుధవారం మండలంలోని పెంబట్లలో పార్టీ మండలస్థాయి కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. తెలంగాణలో అరాచకపాలన సాగుతోందని, దీనిపై దేశ వ్యాప్తంగా చర్చ జరుగుతుందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించితేనే రాష్ట్ర ప్రజలకు న్యాయం జరుగుతుందని గ్రామస్థాయి నుండే ప్రతి కార్యకర్త బీజేపి పరిపాలన ఆవశ్యకతను వివరించాలని సూచించారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడిపల్లి సత్యనారాయణరావు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భోగ శ్రావణి, మండల అధ్యక్షుడు ఎండబెట్ల వరుణ్‌కుమార్, నియోజకవర్గ నాయకులు డాక్టర్ ఎడమల శైలేందర్‌రెడ్డి, పన్నాల తిరుపతిరెడ్డి, కొక్కు గంగాధర్, రెంటం జగదీష్, బద్దెల గంగరాజం, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీజేపీ మండల కార్యకర్తల సమావేశం

ఇబ్రహీంపట్నం: ఎమ్మెల్యే ప్రవాస్ యోజన కార్యక్రమంలో భాగంగా బుధవారం మండల కేంద్రంలో బీజేపీ మండల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మహారాష్ట్ర యావత్మల్ ఎమ్మెల్యే మదన్ మధుకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులకు పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. దేశంలో నిజాయితీగా పరిపాలించే ప్రధాని మోడీయే అన్నారు. కార్యక్రమంలో నాయకులు నవీన్, ప్రభాకర్, వెంకట్, సుఖేందర్‌గౌడ్, జక్రయ్య, రాజు, సునీత పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

'బీఆర్‌ఎస్‌కు బుద్ధి చెబుతాం'

మల్లాపూర్: వడ్డేర సామాజిక వర్గానికి ఎమ్మెల్యే సీటు కేటాయించని బీఆర్‌ఎస్ పార్టీకి రాబోయే ఎన్నికల్లో బుద్ధి చెబుతామని వడ్డేర సంక్షేమ సంఘం జిల్లా నాయకుడు బోసు రాముడెర్రాజు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 30 లక్షల జనాభా కలిగిన వడ్డేర కులానికి 115 నియోజకవర్గాల్లో ఒక్క అసెంబ్లీ సీటుకు సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీ కేటాయించలేదని దుయ్యబట్టారు. వడ్డేర కులాన్ని రాజకీయంగా చిన్నచూపు చూసే పార్టీలను శాసనసభ ఎన్నికలలో ఓటు ద్వారా భూస్థాపితం చేస్తామని హెచ్చరించారు. ఇప్పటికైనా అన్ని రాజకీయ పార్టీలు వడ్డేర కులానికి తగిన ప్రాధాన్యతనివ్వాలని డిమాండ్ చేశారు.

ప్రతి ఒక్కరికీ దళితబంధు ఇవ్వాలి

జగిత్యాల: ప్రతి దళితులకు దళితబంధు ఇవ్వాలని ఎంఎస్పీ జిల్లా కన్వీనర్ గంగారాం అన్నారు. ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతూ, ప్రభుత్వం మెనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. దళితులందరికీ దళితబంధు ఇవ్వకపోవడంతో అసంతృప్తిగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో బోనగిరి కిషన్, శ్రీనివాస్, సతీశ్, లక్ష్మణ్, చంద్రయ్య పాల్గొన్నారు.

పాఠశాలలో మాక్ పోలింగ్

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని మానస ఎక్స్‌లెన్స్ పాఠశాలలో మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవీఎం విధానంలో ఓటు ఎలా వేయాలని విద్యార్థులకు అవగాహన కల్పించారు. లెక్కింపు ఎలా చేస్తారు, ఫలితాలు ఎలా ప్రకటిస్తారనే దానిపై ఉపాధ్యాయులు చక్కగా వివరించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ రజితరావు విద్యార్థులు పాల్గొన్నారు.

బ్యాలెట్‌పై అవగాహన

సారంగాపూర్: ప్రజాస్వామ్య విధానంపై మీరు నేర్చుకోండి... మీ ఇంటిలో అమ్మనాన్నలకు, పెద్దవారికి చెప్పండి అని మండలంలోని రంగపేట ఉన్నత పాఠశాల హెచ్‌ఎం నీలగిరి జయసింహరావు అన్నారు. బుధవారం పాఠశాల ఆవరణలో విద్యార్థులు, వారి తల్లితండ్రులకు ప్రజాస్వామ్యం, ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవడం, సరియైన ప్రజాప్రతినిధిని ఎన్నుకుని శాసన సభకు పంపడంపై అవగాహన కల్పించారు. ఓటు ఎలా వేయాలి అన్నదానిపై విద్యార్థులకు నమూనా బ్యాలెట్ ఏర్పాటు చేసి విద్యార్థుల ప్రతినిధులను ఎన్నుకునే ప్రక్రియను ప్రయోగాత్మకంగా వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ బెక్కం జమున, ఎంపీటీసీ మాలెపు విమల, ఉపసర్పంచ్ రాముడుగు రవి తదితరులు ఉన్నారు.

పద్మశాలీ శంఖారావ పోస్టర్ ఆవిష్కరణ

కోరుట్ల: హైదరాబాద్‌లో సెప్టెంబర్ 3 న జరిగే పద్మశాలీ శంఖారావ భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని తెలంగాణ ప్రాంత పద్మశాలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి జక్కుల జగదీశ్వర్ అన్నారు. ఈ మేరకు పట్టనంలో బహిరంగ సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ చిలివేరి రామకృష్ణ, జక్కుల ప్రసాద్, రాడం అశోక్, తదితరులు పాల్గొన్నారు.

పీజీ ప్రవేశ పరీక్షలో డిగ్రీ విద్యార్థుల ప్రతిభ

కోరుట్ల: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థులు 2023 పీజీ ప్రవేశాల్లో ప్రతిభ చాటారు. మంగళవారం విడుదల చేసిన ఫలితాల్లో విద్యార్థులు రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించారు. ఎంఏ ఉర్దూలో ముషేరానాజ్ స్టేట్ 32వ ర్యాంకు, ఫుడ్ సైన్స్‌లో గుర్రాల శివాణి 357 ర్యాంకు, సోషియాలజీలో బెల్లం కొండ వైష్ణవి 252వ ర్యాంకు, హిస్టరీలో పెంట సుచరిత 347 వ ర్యాంకు సాధించారు. విద్యార్థులను ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ నరేశ్, అధ్యాపకులు అభినందించారు.

ఆరె కటికె మండలాధ్యక్షుడిగా నవీన్

కథలాపూర్: ఆరె కటికె సంఘం మండల అధ్యక్షుడిగా భూషణరావుపేట గ్రామానికి చెందిన గజభీంకార్ నవీన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం మండల సభ్యులు సమావేశమై ఎన్నికలు నిర్వహించారు. ప్రధాన కార్యదర్శిగా న్యాతబాద్ భూమరాజం, ఉపాధ్యక్షుడిగా బాత్‌నాతే సంతోష్, సలహాదారుడిగా గజభీంకార్ ప్రవీణ్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సభ్యులు గజభీంకార్ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తిచేయాలి

జగిత్యాలరూరల్: మహిళ స్వశక్తి సంఘాల్లో నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేయాలని ఏపీఎం గంగాధర్ అన్నారు. బుధవారం టీసెర్ప్ కార్యక్రమాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీవోఏలు తమ పరిధిలో ఉన్న, నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని సూచించారు. ప్రతి అంశాన్ని వీవోఏ లాగిన్‌లో ఎంట్రీ చేయాల్సి ఉందని, దాదాపు 15 రకాల అంశాలు ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేయాల్సి ఉన్నందునా ఆ పనిని త్వరగా పూర్తి చేయాలన్నారు. బ్యాంక్ లింకేజీకి సంబంధించి ఈ ఆర్థిక సంవత్సరం ప్రగతిలో జగిత్యాల అర్బన్ మండలం 55 శాతంతో జిల్లాలో ప్రథమస్థానం, జగిత్యాల రూరల్ మండలం 40 శాతంతో జిల్లాలో నాలుగో స్థానంలో ఉందన్నారు. అన్ని బ్యాంక్ బ్రాంచీల మేనేజర్లు లింకేజీ రుణాలు ఇవ్వడానికి చాలా ఆసక్తిగా ఉన్నారని, లక్ష్యాన్ని డిసెంబర్‌లోపు పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీసీలు రవీందర్, సంతోష్, రాజేందర్, విద్యాసాగర్ పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానం అమలు చేయాలి


సభ్యత్వం తీసుకుంటున్న ఉపాధ్యాయులు

మెట్‌పల్లి: సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు బొమ్మెన చిన్నయ్య కోరారు. పట్టణంలోని పలు పాఠశాలలో బుధవారం యూనియన్ సభ్యత్వ నమోదు చేపట్టి మాటాడారు. టీచర్ల బదిలీలు,ప్రమోషన్ల విషయంలో ప్రభుత్వం జాప్యం చేయడం తగదన్నారు. వెంటనే వీటిని చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే పీఆర్‌సీని ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బాలకిషన్, గంగాప్రసాద్, నగేశ్, నవీన్, సంతోష్ తదితరులున్నారు.

సీపీఎస్ విధానం రద్దు చేయాలి

గొల్లపల్లి: సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్)జిల్లా ప్రధానకార్యదర్శులు బోనగిరి దేవయ్య, బోయినిపల్లి ప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని గొల్లపల్లి చిల్వాకోడూర్ మల్లన్నపేట, వెన్గుమట్ల, ఇబ్రాజీపల్లి,భీబీరాజ్‌పల్లితో పాటు మండంలోని పలు పాఠశాలల్లో తపస్ సభ్యత్వ నమోదు చేపట్టారు ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో 317 జీవో బాధిత ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని వారిని స్థానికత ఆధారంగా స్వస్థలాలకు పంపించాలని డిమాండ్ చేశారు. పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని పీఆర్సీ కమిటీ వేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు గంగారెడ్డి, పూర్ణచందర్, మొగిలి రవి, సురేశ్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్షా ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి



పోస్టుకార్డులను పంపిస్తున్న సీఆర్పీలు

రాయికల్: తెలంగాణ సమగ్ర శిక్షాలో పనిచేస్తున్న ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలని కోరుతూ బుధవారం సీఎం కేసీఆర్, మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్‌లకు పోస్టుకార్డు ద్వారా తమ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా జిల్లా సమగ్ర శిక్షా జాయింట్ యాక్షన్ కమిటీ కార్యదర్శి రవీందర్‌రావు మాట్లాడుతూ 18 ఏళ్లుగా సమగ్ర శిక్షాలో కాంట్రాక్ట్ సీఆర్పీలుగా పనిచేస్తున్నామని, తమను రెగ్యులర్ చేయాలని కోరారు. కార్యక్రమంలో చెన్నమనేని వెంకటేశ్వర్‌రావు, సౌజన్య, రమేశ్ పాల్గొన్నారు.